ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు కోరారు.

–సాక్షి నెట్‌వర్క్.


బాడంగి: గజరాయునివలసలో వైద్య శిబిరంలో ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్య సిబ్బంది


తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారంలో మహిళ కళ్లను తనిఖీ చేస్తున్న దృశ్యం


రామభద్రపురం: తారాపురంలో మందుల కిట్ అందజేస్తున్న ఎంపీడీవో రమామణి, వైద్యాధికారులు


రేగిడి: పెద్దకోడిశలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం


సంతకవిటి: వాసుదేవపట్నం గ్రామంలో రోగి సమస్య విని, ప్రిస్క్రిప్షన్ రాస్తున్న వైద్యాధికారిణి


వంగర: తలగాంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది


బొబ్బిలి: చింతాడలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్


సీజ్ చేసిన లారీ వద్ద ఎస్‌ఈబీ సిబ్బంది

రేగిడి: మండలంలోని తాటిపాడు జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది సోమవారం పట్టుకుని, సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా రాజాం వైపు ఇసుకను తరలిస్తుండడంతో లారీని ఆపి, కేసు నమోదు చేశామని వారు తెలిపారు.

నేడు గొంగాడవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బొబ్బిలి: మండలంలోని గొంగాడవలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం


రాజాం: జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కిరణ్, రమ తదితరులు కలిసి రైతులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వినియోగించే వివిధ కషాయాలు, ద్రావణాలు, లింగాకర్షణ బుట్టలు, కిచెన్ గార్డెన్ విత్తనాలు, పీఎండీఎస్ విత్తనాలు, దేశీయ విత్తనాలు, ఘనజీవామృతం వంటి వాటి గురించి వివరించారు. అనంతరం జిల్లేడు ద్రావణాన్ని తయారు చేసి, దానిని పంటలపై పిచికారీ చేయడాన్ని తెలిపారు. వరి పంటలో జిల్లేడు ద్రావణాన్ని వేయడం ద్వారా పంటలో పొటాష్ లోపాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తపాలా దినోత్సవం


విద్యార్థులకు తపాలా శాఖ సేవలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు మధుసూదనరావు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో తపాలా దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది విద్యార్థులకు డిజిటల్ బోర్డుపై తంతీతపాలా సేవలు, పోస్టుకార్డులు, తపాలాబిళ్లలు, స్టాంపులు, టెలిగ్రామ్, మనియార్డర్లు వంటి వాటి గురించి వివరించారు. అలాగే ప్రస్తుతం తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను క్షుణ్ణంగా తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.మహేశ్వరరావు, ఉపాధ్యాయులు కె.మధుసూదనరావు, పి.మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరరావు

రాజాం సిటీ: మండలంలోని అన్ని పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి, మండల స్థాయి అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పంచాయత్ డెవలప్‌మెంట్ ఇండెక్స్(పీడీఐ) వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నిర్దేశిత సమయంలో పనులను పూర్తిచేసి, ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆగూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

మెంటాడ: మండలంలోని ఆగూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో త్రివిక్రమ్ సోమవారం తెలిపారు. స్పెషలిస్టులైన ఆరుగురు వైద్యులు అందుబాటులో ఉంటారని, రోగులు శిబిరానికి వచ్చి, వైద్యసేవలు పొందాలని కోరారు.

పంచాయతీల సమగ్రాభివృద్ధికి పాటుపడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఆంజనేయులు

బాడంగి: పంచాయతీల సమగ్రాభివృద్ధికి పాటుపడాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన గ్రామంలో ఎంతమంది జనాభా ఉన్నారు.. ఏయే కేటగిరీల వారు ఎంతమంది ఉన్నారనే దానిపై సర్వే చేయాలన్నారు. కార్యదర్శులే ఫెసిలిటేటర్లుగా వ్యవహరించాలని, వారు లేనిచోట డిజిటల్ సహాయకులు లేదా ఆర్‌బీకేలో పనిచేస్తున్న వీఏఏలు బాధ్యతలు తీసుకోవాలని తెలిపారు. సచివాలయం పరిధిలోని మొత్తం డిపార్ట్‌మెంట్‌లకు చెందిన 22 అంశాలపై సమగ్ర సమాచారం సమర్పించాలన్నారు. దీని ఆధారంగా మండల స్థాయి అధికారులు మరో రిపోర్టు ఇస్తే దానిని జిల్లాకు పంపించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల సమస్యలపై నివేదికలో పేర్కొన్నాలని దీనిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశం కావాలన్నారు. సమావేశంలో పీఆర్ ఏఈ రమేష్, మండల పరిషత్ ఏవో రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పారాది వంతెన మరమ్మతులు


వంతెన కింద కొనసాగుతున్న మరమ్మతు పనులు పరిశీలిస్తున్న అధికారులు


వంతెనపై బస్సుతో ట్రయల్ రన్ వేస్తున్న దృశ్యం

బొబ్బిలి: మండలంలోని పారాది వంతెన మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి వేగావతి నదిపై వందేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన కుంగిపోయే దశలో ఉండగా, స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు వంతెన స్థితిగతులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మంజూరైన నిధులతో వంతెన పనులు చకచకా జరుగుతున్నాయి. వారం రోజుల పాటు వంతెన కింద పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. నాటి నిర్మించిన వందేళ్ల నాటి వంతెన మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీ నుంచి వంతెన మీదుగా లారీలు మినహా బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు సాధ్యాసాధ్యాలపై ఆలోచిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. వంతెనకు రెండు వైపులా ఉండే రెయిలింగ్‌ను ఏదో భారీ వాహనం ఢీకొనడం వలనే వంతెన కుంగుబాటు జరిగిందని అధికారులు భావిస్తున్నారు. సోమవారం సాయంత్రం వంతెన మీదుగా బస్సు ట్రయల్ రన్ నిర్వహించారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ జనార్దనరావు, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత శాతాన్ని పెంచాలి


మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: మండలంలో అక్షరాస్యత శాతాన్ని పెంచాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో శంబంగా రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన గ్రామ పంచాయతీల అభివృద్ధి, దానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, గ్రామంలో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలన్నారు. అలాగే మండలంలో విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దారు డి.రత్నకుమార్, ఎస్‌ఐ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలి

రామభద్రపురం:


పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఈవోపీఆర్‌డీ వెంకటరమణ

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల సమస్యలు లేకుండా చూడాలని ఈవోపీఆర్‌డీ వెంకటరమణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన గ్రామాలను గ్రేడ్-1లో నిలపాలన్నారు. గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నారు. ఆర్థిక సంఘం నిధులను గ్రామ ప్రజల మౌలిక వసతుల కల్పనకు వెచ్చించాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

తూటికాడ కషాయం తయారీపై అవగాహన


రేగిడి: ఉంగరాడలో తూటికాడ కషాయం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలోని రైతులకు తూటికాడ కషాయం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు పుర్లి లక్ష్మణనాయుడు, రమణ కలిసి తూటి ఆకులతో కషాయం తయారు చేయడాన్ని రైతులకు నేర్పించి, దానిని పంటలపై పిచికారీ చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. తూటికాడ కషాయం పంటలపై పిచికారీ చేయడం ద్వారా పంటలకు పట్టే తెగుళ్లు, చీడపీడలు, సుడిదోమ పోటు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గౌరునాయుడు, సర్పంచ్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో పత్ర ద్రావణాల తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. వేప, కానుగ, ఉమ్మెత్త, జిల్లేడు, మారేడు, వెదురు, వావిలాకు, రావి, మందార, కలబంద, తూటికాడ ఆకులు, తులసి, అత్తాకోడల్లాకు, వెంపలాకులు సేకరించి, వాటితో 150 లీటర్ల పత్ర ద్రావణాన్ని తయారు చేసి, పంటలపై పిచికారీ చేశారు. ఈ ద్రావణాలు మొక్కల ఎదుగుదలతో పాటు శిలీంద్రనాసినిగా కూడా ఉపయోగపడతాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతీశ్వరరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలు పరిష్కరించాలి

రాజాం: స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల డీడీవోలతో సమావేశమైన ఆయన ప్రతీ ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా సమస్యల పరిష్కారం చేపట్టాలన్నారు. అలాగే పంచాయతీల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను వెబ్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అంతకుముందు శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి వావిలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం


రాజేంద్రనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

రాజాం: స్థానిక పట్టణంలోని రాజేంద్రనగర్‌లో రూ.2.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులను ఏఈ పి.వెంకట్ సోమవారం పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు.

పీహెచ్‌సీలో గర్భిణులకు భోజనాలు

రేగిడి: స్థానిక పీహెచ్‌సీకి వైద్య తనిఖీల నిమిత్తం సోమవారం విచ్చేసిన గర్భిణులకు సత్యసాయి భజన మండలి సభ్యులు సోమవారం భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రతినెలా 9వ తేదీన ఆస్పత్రికి వచ్చే గర్భిణుల ఆరోగ్యం దృష్ట్యా తమవంతు సాయంగా ఒక్కపూట ఆకలి తీర్చే ప్రయత్నం చేస్తున్నామని సత్యసాయి భక్తులు తెలిపారు. నారాయణసేవలో భాగంగా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

పశువ్యాధులపై రైతులను అప్రమత్తం చేయాలి

సంతకవిటి: పశువ్యాధులపై రైతులను అప్రమత్తం చేయాలని మండల పశుసంవర్ధక శాఖ ఏడీ సి.హెచ్.తిరుపతిరావు సూచించారు. సోమవారం స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో గోపాలమిత్రలతో సమావేశమైన ఆయన గ్రామాల్లోని రైతులకు సకాలంలో పశువైద్య సేవలు అందించాలని తెలిపారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

17న ద్విచక్ర వాహనం వేలం

వేపాడ: వల్లంపూడి పోలీసు స్టేషన్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని(ఏపీ 31 బీజే 6389, ఆరెంజ్ కలర్ పల్సర్) ఈ నెల 17న ఎస్.కోట పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు వల్లంపూడి ఎస్సై రాజేష్ సోమవారం తెలిపారు. రూ.10 వేల నుంచి వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని వాహనాన్ని సొంతం చేసుకోవాలని కోరారు.

ధ్యాన సాధనపై శిక్షణ


ధ్యాన సాధనపై అవగాహన కల్పిస్తున్న ప్రజాపిత బ్రహ్మకుమారి రాజేశ్వరి

బొబ్బిలి: స్థానిక యోగా ధ్యాన కేంద్రంలో రెవెన్యూ సిబ్బందికి ధ్యాన సాధనపై సోమవారం శిక్షణ ఇచ్చారు. బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ బి.కె.రాజేశ్వరి మాట్లాడుతూ ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ ఒత్తిడికి దూరంగా ఉండి, మానసిక ప్రశాంతత కలిగి ఉండాలన్నారు. అప్పుడే ఆయుష్షు కాలం పెరుగుతుందన్నారు. ఏయే ధ్యానాలు అవలంబిస్తే ఒత్తిడి జయించి, మానసికంగా ప్రశాంతంగా ఉండగలమో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు దోల రాజేశ్వరరావు, డీటీలు బలివాడ గౌరీ శంకరరావు, ఆర్.సాయికృష్ణ, ఆర్‌ఐ కల్యాణచక్రవర్తి, రీసర్వే డీటీ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

రేగిడి: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మండలంలోని లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.సాయితేజ, ఎం.మణికంఠ ఎంపికైనట్లు పీడీలు జె.హైమావతి, సూరప్పనాయుడు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి జరగబోయే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, సర్పంచ్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎస్.కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

టీడీపీ హయాంలోనే శంకుస్థాపన చేసి, వదిలేశారు..


మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షంనాయుడు

బొబ్బిలి: మండలంలోని పారాది వంతెనకు టీడీపీ హయాంలోనే శంకుస్థాపన చేసి, వదిలేశారని రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షంనాయుడు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ ప్రధాన వంతెనను టీడీపీ పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వైఎస్సార్ సీపీనే వంతెన పనులకు నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టరు ముందుకు రాలేదన్నారు. వంతెన నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

రాములోరి పవిత్రోత్సవాలకు అంకురార్పణ


అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో రామచంద్ర స్వామి పవిత్రోత్సవాలకు ఆలయ అర్చకులు సోమవారం అంకురార్పణ నిర్వహించారు. స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో విశేష హోమాలు చేపట్టి వెండి మంటపం వద్ద సీతారాముల కల్యాణం వేడుకగా జరిపించారు. సాయంత్రం ఆశీర్వచన మంటపంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం కార్యక్రమాలను వైఖానస ఆగమోక్తంగా జరిపించి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. అర్చకులకు దేవస్థాన ఈఓ కిషోర్‌కుమార్ దీక్షా వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 11 వరకు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించి .. 12న శాంతి కల్యాణం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

బొండపల్లి: మండలంలోని గొట్లాం పంచాయతీ పరిధి డోలపేట గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త సూర్యకాంతం కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసకుంటోంది. విషయం తెలుసుకున్న బొండపల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది రూ.50 వేలు సేకరించి సోమవారం సూర్యకాంతం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, సీహెచ్‌ఓ రాజగోపాల్, హెల్త్ సూపర్‌వైజరు ఎస్.ఎ.భాషా పాల్గొన్నారు.

సేవలందించడంలో జాప్యం వద్దు

మెంటాడ(గజపతినగరం రూరల్): సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో జాప్యం వహించొద్దని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ సూచించారు. వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సోమవారం తన ఛాంబర్‌లో సమావేశమై పలు సూచనలు చేశారు. అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు. విద్యాశాఖ పనితీరు మెరుగుపడేలా చూడాలని ఎంఈఓ విమల కుమారికి సూచించారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులు ఎంతవరకు వచ్చాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ఆరా తీశారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.